క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మూసాపేట: కేపీహెచ్‌బీ 7వ ఫేజ్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కేపీహెచ్‌బీ 7వ ఫేజులో, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు కైత్లాపూర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మైత్రీనగర్, ఆర్‌పీకాలనీ ఫీడర్ల పరిధిలో...
కూకట్‌పల్లి: మైత్రీనగర్ ఫీడర్ పరిధిలోని మైత్రినగర్ ఇండస్ట్రియల్ ప్రాతం, విజ్ఞానపురి కాలనీ, ఏవీబీ పురం, శక్తిపురం సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు... ఆర్‌పీకాలనీ ఫీడర్ పరిధిలోని ఆర్‌పీ కాలనీ, హనుమాన్‌నగర్, వేంకటేశ్వరనగర్, దీనబంధకాలనీ, రామకృష్ణ నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శరత్‌బాబు తెలిపారు.

వడ్డేపల్లి, చిత్తారమ్మ ఫీడర్ల పరిధిలో...
కూకట్‌పల్లి: వడ్డేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని బాలకృష్ణ నగర్, కృష్ణనగర్, లక్ష్మీనగర్‌లలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు.. చిత్తారమ్మ ఫీడర్ పరిధిలో సప్తగిరినగర్, అయ్యప్పస్వామి, చిత్తారమ్మ దేవాలయం ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని కూకట్‌పల్లి ఏఈ చైతన్య తెలిపారు.

పిచ్చి మొక్కలను తొలిగించండి



సిక్కు బస్తీలో సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ పరిధిలోని కేటీఆర్ కాలనీ, సిక్కుల బస్తీ పరిసర ప్రాంతాల్లోని ఖాళీ ప్రదేశాల్లో డ్రైనేజీ వాటర్ వచ్చి చేరి పిచ్చిమొక్కలు పెరిగి దోమలకు ఆవాసంగా మారాయని... అదే విధంగా మూగజీవాలతో ఇబ్బందిగా ఉందని స్థానికులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదివారం ఆ ప్రాంతాలకు స్వయంగా వెళ్లి పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న చెట్లు, పిచ్చి మొక్కలను తొలగించి ఆ ప్రదేశమంతా శుభ్రం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, షౌకత్‌అలీ మున్నా, మోజెస్, వాసుదేవరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



తులసీనగర్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ తులసీనగర్‌లో వేస్తున్న కొత్త రోడ్డు పనులను కార్పొరేటర్ సబిహా బేగం ఆదివారం పరిశీలించారు. రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువాలన్నారు. ఈ సందర్భంగా అక్కడి వారిని సమస్యలను అడిగి తెలుసుకోగా మంచినీటి సమస్య ఉందని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఆమె వెంకటే వాటర్ వర్క్స్ లైన్ మాన్‌ని పిలిపించి సమస్యను పరిష్కరించారు. ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే అధికారులను సంప్రదించి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తులసినగర్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, వాటర్‌వర్క్స్ మొగులయ్య, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, రవీందర్‌రెడ్డి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అపర్ణ గ్రాండేలో రన్ డే

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ గ్రాండేలో ఆదివారం రన్ డేను నిర్వహించారు. గ్రాండే రన్ డే పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమంలో కమ్యూనిటీలోని యువకులు, చిన్నారులు, మహిళలు, సీనియర్ సిటిజన్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 3, 5, 10 కిలోమీటర్ల రన్నింగ్, వాకింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మంథన్ ఇంటర్నేషనల్ స్కూల్ సహకారంతో మెడల్స్‌ను అందజేశారు. ఈ పోటీల్లో సుమారు 1500 మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, శంకర్, బాబిరెడ్డి, హరికుమార్, శాలిని, రాధారెడ్డి, అంబిలి, గౌరి, చేతనా భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ జాగా కనిపిస్తే కబ్జానే.!

- కబ్జాకు గురవుతున్న చెరువులు, అలుగు, బఫర్ జోన్‌లు
- పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు



◆ మూసాపేటలోని మైసమ్మ చెరువులో అలుగు, బఫర్ జోన్‌లో కొందరు కబ్జాకు యత్నిస్తున్నారు. ఇటీవల చెరువుకట్ట కింద గోదాంకు ఆనుకుని ఉన్న కబ్జాకు యత్నించారు. చుట్టూ కట్టెలతో రేకులు అడ్డు పెట్టి కబ్జాకు యత్నిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతం చెరువు బఫర్ జోన్ పరిధిలోకి వస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. మండల అధికారులు పరిశీలించి చెరువు కట్ట కింద ఉన్న స్థలం ప్రభుత్వానిది అయితే కాపాడాలని కోరుతున్నారు.



మూసాపేటలోని మైసమ్మ చెరువులో కబ్జాకు గురువుతున్న ప్రాంతం

మూసాపేట: కబ్జాకు కానిదేది అనర్హం. చెరువులు కబ్జా చేయడమే కాక అలుగు, బఫర్ జోన్‌లు కూడా కబ్జాకు గురవుతున్నాయి. ఖాళీ జాగా కనిపించడమే ఆలస్యం కబ్జాదారులు చుట్టూ ఫెన్సింగ్ వేసి కబ్జాకు యత్నిస్తున్నారు. చెరువు కబ్జా కావడంతో వర్షాకాలంలో చిన్న చిన్న వర్షాలకే నిండి అలుగుపోయే అవకాశం ఉంది. దీంతో అలుగును కబ్జా చేస్తే నీరు ఎలా వెళ్తుందని పరిసర కాలనీల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధిక వర్షం కురిస్తే నీళ్లు కాలనీలను ముంచెత్తుతాయని పేర్కొంటున్నారు. అధికారులు అప్పుడు స్పందించే బదులు ఇప్పుడే స్పందించి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

◆ చెరువు అలుగు వద్ద గతంలో మహిళలు బతుకమ్మలు ఆడుకోవడానికి బతుకమ్మ కుంటలో అభివృద్ధి పనులు చేశారు. కొన్ని సంవత్సరాలు మహిళలు బతుకమ్మలు విడిచి పెట్టారు. కానీ ప్రస్తుతం బతుకమ్మ కుంట ఆనవాళ్లు కూడా లేవు. మొత్తం మట్టి నింపేశారు. అంతే కాకుండా చెరువు అలుగు ద్వారా వెళ్లిన నీరు బతుకమ్మ కుంట నిండి ఓపెన్ నాలా ద్వారా నీరు వెళ్లేవి.

◆ గతంలో నీరు ఎక్కువగా పొంగి ప్రవహించడంతో పాత బ్రిడ్జి పడిపోయే ప్రమాదం ఉండటంతో కొత్త బ్రిడ్జిని నిర్మించారు. ఇప్పుడు అలుగు, బఫర్ జోన్ కబ్జా కావడం బతుకమ్మ కుంటనే కనుమరుగు కావడంతో నాలా పొంగి పక్కనే ఉన్న ఇళ్లలోకి నీరు వెళ్లే అవకాశం ఉంది. బతుకమ్మ కుంటను కొన్ని నెలలుగా పూడ్చి వేస్తున్నా అధికారులు గానీ, ప్రజాప్రతినిదులు గానీ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జా భూమిని పరిశీలించి నీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవడమే కాక భూమిని కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బస్తీ దవాఖానాలతో పేదలకు మెరుగైన వైద్య సేవలు

- అసెంబ్లీలో ఎమ్మెల్యే వివేకానంద్
- ఆదివారం సైతం అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి



కుత్బుల్లాపూర్: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆదివారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ బస్తీ దవాఖానాల్లో సేవలు, మెడికల్ కళాశాల ఏర్పాటు, ఆశా పోస్టుల భర్తీ తదితర అంశాలను ప్రస్తావించారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించే మహోన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని అన్నారు. ఆదివారం బస్తీ దవాఖానాలకు సెలవు ఇవ్వకుండా అందుబాటులో ఉంచితే ప్రజలకు మరింత సేవలు అందుతాయని అన్నారు. అందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన మాట ప్రకారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 20 ఎకరాల హెచ్‌ఎంటీ స్థలాన్ని గుర్తించామన్నారు. అందులో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి హరీష్‌రావును కోరారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని గాగిల్లాపూర్‌లో పేదలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న భవనంలో బస్తీ దవాఖానా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై మంత్రి హరీష్‌రావు సమాధానమిస్తూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అవసరమైన బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో మెడికల్ కాలేజీ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

స్తంభం ఏర్పాటును అడ్డుకున్న స్థానికులు



కృషి కాలనీలో విద్యుత్ స్తంభం ఏర్పాటు పనులను అడ్డుకుంటున్న స్థానికులు

సుభాష్‌నగర్: ఒక్కరి ప్రయోజనం కోసం కాలనీవాసులకే ఇబ్బంది కలిగేలా విద్యుత్ అధికారులు వ్యవహరిస్తున్నారని కృషికాలనీ మాజీ ప్రెసిడెంట్ పాషా ఆరోపించారు. సుభాష్‌నగర్ డివిజన్ కృషి కాలనీలోని ఆదివారం విద్యుత్ సిబ్బంది రాకపోకలకు ఇబ్బంది కలిగే విధంగా స్తంభం పాతడంపై స్థానికులు అడ్డుకున్నారు. గతంలో కొన్నిచోట్ల ఇష్టం వచ్చినట్టు విద్యుత్ పోల్ ఏర్పాటు చేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదురైందని పేర్కొన్నారు. ఒక్కరి ప్రయోజనం కోసం మళ్లీ అదే విధంగా ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో సిబ్బంది పనులు నిలిపివేసి వెనుదిరిగారు.

కబ్జాలపై పోరాడుతున్నందుకే నాపై కుట్రలు

నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్



బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: ప్రజా సమస్యలు, ప్రభుత్వ భూములు, చెరువు స్థలాల కబ్జాలపై పోరాడుతున్న తనను రాజకీయంగా, భౌతికంగా అడ్డు తొలగించేందుకు కొన్ని పార్టీల నాయకులు కుట్ర పన్నుతున్నారని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. ఆదివారం బీజేపీ నాయకులతో కలిసి తనపై కుట్ర పన్నుతున్న విషయమై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆయన బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

◆ ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ... నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో మౌలిక సదుపాయాల ఏర్పాటు విషయమై నిరంతరం పోరాటం చేస్తున్నానన్నారు. అదే విధంగా ప్రభుత్వ భూముల కబ్జాలు, అక్రమ నిర్మాణాలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి కాపాడే ప్రయత్నం చేస్తుండటంతో ప్రతిపక్ష, అధికార పక్ష పార్టీలకు మింగుడు పడటం లేదని పేర్కొన్నారు.

◆ దీనిపై ఆగ్రహించిన వారు తనను రాజకీయంగా ఎదుర్కోలేక భౌతికంగా తనపై దాడి చేసేందుకు అధికార పార్టీతో కొన్ని రాజకీయ పక్షాలు కుట్ర పన్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి వ్యక్తికి కొన్ని హక్కులు, బాధ్యతలు ఉంటాయన్నారు. ప్రజల ఆస్తులు కాపాడటంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో కబ్జాదారుల అవినీతి బాగోతాన్ని బయటపెట్టడానికి మరింత పని చేస్తామన్నారు.

◆ రాష్ట్ర మైనార్టీ మోర్చా మహిళా ప్రముఖ అమలేశ్వరి, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు కాశి, ప్రధాన కార్యదర్శి భిక్షపతియాదవ్, కార్యవర్గ సభ్యుడు శివ, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ రాజు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మదన్‌గౌడ్, కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, 7వ డివిజన్ అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు మురళి, సతీష్, కృష్ణ తదితరులు ఫిర్యాదు చేసిన ఉన్నారు.



గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బీఆర్‌ఎస్‌లో చేరికలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం కూకట్‌పల్లి, మూసాపేట డివిజన్లకు చెందిన కాంగ్రెస్, బీజేపీ యువ నాయకులు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో ఎస్సీసెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు ఆధ్వర్యంలో 60 మంది యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారందరికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో జరగుతున్న అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్ పార్టీలో చేరామన్నారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తూ.. తెలంగాణ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అహర్నిశలు పనిచేస్తున్నారని అన్నారు. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే కోట్లాది రూపాయల నిధులను తీసుకువచ్చి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. అందుకే ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి దిగ్బంధాన్ని విజయవంతం చేయాలి

కుత్బుల్లాపూర్: ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీల ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధాన్ని విజయవంతం చేయాలని మాదిగ ఉపకులాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం కుత్బుల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు మాటాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడతామన్న కేంద్ర ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు.

కేంద్రం వర్గీకరణ చేపట్టడంతో వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టేందుకు చేపట్టనున్న జాతీయ రహదారి దిగ్బంధం కార్యక్రమానికి వేలాదిగా మాదిగ ఉపకులాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. శ్రీనివాస్ మాదిగ, యాదగిరి, మహేష్, నర్సింహులు మాల, రాణి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భూములు అమ్మడమే తప్ప పంచిన దాఖలాలు లేవు

బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్



బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

కుత్బుల్లాపూర్: బీఆర్‌ఎస్ పాలనలో ప్రభుత్వ భూములను విక్రయించడమే తప్ప పేదలకు పంచిన దాఖలాలు లేవని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ప్రజా గోస – బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా ఆదివారం జీడిమెట్ల డివిజన్ పరిధి వినాయకనగర్‌లో శక్తి కేంద్రాల స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు శ్రీశైలంగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యే వివేక్ తాను పని చేయడం లేదన్నారు. నియోజకవర్గంలో తిరగడం లేదని తన పిల్లలే చెబుతున్నారని అసెంబ్లీ సాక్షిగా ఒప్పుకున్నారని పేర్కొన్నారు.

◆ టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అయ్యాడని.. త్వరలో వీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అవుతాడని ఎద్దేవా చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వినాయకనగర్‌లో వేసిన డ్రైనేజీ లైన్‌లు, రోడ్లు వేశామని గుర్తు చేశారు. ఎనిమిదేళ్ల కాలంలో ప్రస్తుత ఎమ్మెల్యే చేసిందేమీ లేదన్నారు. బస్తీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి బీజేపీ నిరంతరం పోరాటాలు సాగిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ నర్సింగరావు, 488 బూత్ అధ్యక్షుడు చంద్రయ్య, 489 బూత్ అధ్యక్షుడు అబీద్, నాయకులు మురళి, పండు, నాగరాజు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫుడ్, క్రాఫ్ట్ ఫెస్టివల్





మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న ఒడిశా ఫుడ్ క్రాఫ్ట్ ఫెస్టివల్ ఆదివారం ముగిసింది. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఒడిస్సీ, సంబల్పూరి జానపదం, గిరిజన నృత్యాలు సందర్శకులను అలరించాయి. - మాదాపూర్

శాసనమండలి గౌరవ, మర్యాదలు పెంచేలా నడుచుకుంటా





సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ విప్‌గా శాసనమండలి గౌరవ మర్యాదలు పెంచేలా నడుచుకుంటానని ఈ సందర్భంగా శంభీపూర్ రాజు అన్నారు. అదే విధంగా శంభీపూర్‌లోని కార్యాలయంలో పలువురు ప్రజాప్రతినిధులు, సంక్షేమ సంఘాలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్‌గా నియమితుడైన సందర్భంగా శంభీపూర్ రాజుకు అభినందనలు వెల్లువెత్తాయి.

ప్రజలంతా ఏకమై బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

- అర్బన్ జిల్లా పార్టీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి
- మూసాపేట డివిజన్‌లో జేపీ స్ట్రీట్ కార్నర్ సమావేశం



మాట్లాడుతున్న అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి

మూసాపేట: ×ప్రజా గోస – బీజేపీ భరోసా×కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్ట్రీట్ కార్నర్ సమావేశం మూసాపేట డివిజన్‌లోని శక్తి కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రెడ్డి మాట్లాడుతూ... రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని ఓడించాలన్నారు. కూకట్‌పల్లిలో అనేక కబ్జాలు చేస్తూ ప్రజలను మాయమాటలతో బురిడీ కొట్టిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యేని ఓడించాలని ప్రజలను కోరారు. స్ట్రీట్‌కార్నర్ మీటింగ్ అంటే వేల సంఖ్యలో పెట్టే సభ కాదని కేవలం వందల సంఖ్యలో వచ్చే జనాలతో పెట్టే సమావేశాలని అన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు డబుల్ బెడ్ రూమ్‌లు రాలేదని, పెన్షన్‌లు రావట్లేదని, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదని పేర్కొన్నారు. అయినా ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ రాష్ట్ర ప్రజలను మభ్య పెడుతున్నారని విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా, అభ్యర్థి ఎవరైనా ప్రజలంతా ఏకమై బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని అభ్యర్థించారు.

కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు ఓడిపోవడం ఖాయం

◆ కార్పొరేటర్ మహేందర్ మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే పేదలకు ఉచిత విద్య, వైద్యం, నిరుపేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నూతన గృహాలు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. రానున్నది బీజేపీ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు ఓడిపోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కన్వీనర్ శ్రీకర్‌రావు, మూసాపేట డివిజన్ అధ్యక్షుడు పిట్ల మనోహర్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ కృష్ణ ముదిరాజ్, బూత్ అధ్యక్షుడు డి. శ్రీనివాస్, మంగమ్మ ముదిరాజ్, కిశోర్ కుమార్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.